సాక్షి
గుంటూరు
బుధవారం । 26 । మార్చి । 2025



వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

దుగ్గిరాల: శ్రవణానక్షత్రం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం దుగ్గిరాల వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం ఘనంగా జరిగింది.



అమరావతిలో జపాన్ బృందం

అమరావతి: ప్రముఖ పర్యాటక కేంద్రం అమరావతిని మంగళవారం జపాన్ ప్రతినిధుల బృందం సందర్శించింది. వారివెంట ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఉన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



బాపట్ల: బాపట్ల పట్టణం పాతబస్టాండ్‌లోని శ్రీ లక్ష్మీపద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. శాంతి కల్యాణ మహోత్సవం చేపట్టారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహర్ (గురు)
గుంటూరు	6.25	4.51
నరసరావుపేట	6.27	4.53
బాపట్ల	6.25	4.51

సొంత రాజ్యాంగం పులిమేసి!

- మున్సిపల్ చట్టాలకు తూట్లు
- కమిషనర్ పులి శ్రీనివాసులు తీరుపై వైఎస్సార్ సీపీ సభ్యుల ధ్వజం
- మేయర్ రాజీనామా ఆమోదంపై కౌన్సిల్ నిర్వహణ!
- అసలు రాజీనామా ఫార్మెటే సరికాదు
- వైఎస్సార్ సీపీ సభ్యుల వాకౌట్
- మెజార్టీ సభ్యుల మద్దతుతో మేయర్ రాజీనామా ఆమోదం



కౌన్సిల్ నుంచి వాకౌట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ సభ్యులు

నెహ్రూనగర్ (గుంటూరుఈస్ట్) : గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు రాజీనామాపై మున్సిపల్ చట్టాలను కాదని కమిషనర్ తన సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు) దుయ్యబట్టారు. ఈనెల 15న మేయర్ కావటి మనోహర్‌నాయుడు తన పదవికి రాజీనామా చేసి కలెక్టర్‌కు పంపిన విషయం తెలిసిందే. మేయర్ రాజీనామా ఆమోదం కోసం మంగళవారం కౌన్సిల్ హాల్‌లో అత్యవసర కౌన్సిల్ సమావేశం జరిగింది. ముందుగా తాత్కాలిక మేయర్‌గా షేక్ సజీల తన నియామకానికి కారణమైన ప్రభుత్వ పెద్దలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఆ తరువాత మేయర్ రాజీనామా ఆమోదానికి సభ్యుల అభిప్రాయాలు తెలియజేయాలని సజీల కోరారు. వెంటనే డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు మాట్లాడుతూ మేయర్ రాజీనామా లేఖను కలెక్టర్‌కు పంపితే.. ఆ లేఖ ఆధారంగా కౌన్సిల్ ఎలా నిర్వహిస్తారు? అస లు కలెక్టర్ నగరపాలక సంస్థకు మేయర్ రాజీనామాపై ఏమని రాశారో చెప్పాలని సెక్రటరీని కోరారు.

మౌనం వహించిన సెక్రటరీ

డెప్యూటీ మేయర్ అడిగిన ప్రశ్నపై కౌన్సిల్ సెక్రటరీ మౌనం వహించారు. దీంతో వెంటనే కమిషనర్ పులిశ్రీనివాసులు అందుకుని సమాధానం చెప్పే యత్నం చేశారు. మేయర్ పదవికి మనోహర్ రాజీనామా చేస్తూ లేఖను మెయిల్ ద్వారా కలెక్టర్‌కు, కమిషనర్‌కు పంపారని, దీనిపై నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారని కమిషనర్ వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మేయర్ రాజీనామాపై అత్యవసర కౌన్సిల్ నిర్వహణకు ఉన్న ఇద్దరు డెప్యూటీ మేయర్లలో ఒకరిని మేయర్‌గా ఎంపిక చేసేలా చర్యలు తీసుకోవాలని ఈ నెల 17న మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి, ఎంఏయూడీ శాఖకు లేఖ రాశామని, ఈ నెల 21న డెప్యూటీ మేయర్ షేక్ సజీలను తాత్కాలిక మేయర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. దీని ప్రకారం అత్యవసరం కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

మేయర్ రాజీనామా ఫార్మెట్ సరైంది కాదు

"మున్సిపల్ చట్టం 92 (1) మేయర్ తన పదవికి రాజీనామా చేయాలంటే కౌన్సిల్ నిర్వహించి కౌన్సిల్‌లో రాజీనామాకు గల కారణాలను చర్చించిన తరువాత సభ్యుల ఆమోదంతో రాజీనామాను ఆమోదించాలి. లేదా కౌన్సిల్ సెక్రటరీకి రాజీనామాను పంపితే ఆ రాజీనామాకు అనుగుణంగా సెక్రటరీ అత్యవసర కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి ఆ తరువాత రాజీనామాను ఆమోదించాలి. కానీ ఇక్కడ నగర కమిషనర్ కలెక్టర్‌కు పంపిన రాజీనామాను ఆధారం చేసుకుని కమిషనర్ తన సొంత రాజ్యాంగాన్ని అమలు చేసి ప్రభుత్వానికి లేఖ రాయడమేమిటి'' అని డెప్యూటీ మేయర్ వజ్రబాబు ప్రశ్నించారు. దీనిపై తాము లీగల్ ఓపీనియన్ తీసుకుంటామని.. అప్పటి వరకు మేయర్ రాజీనామా ఆమోదం కోసం ఏర్పాటు చేసిన కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేయాలని కోరుతూ కౌన్సిల్ సెక్రటరీకి వినతి పత్రం అందజేశారు. అనంతరం సభ నుంచి వైఎస్సార్‌సీపీ సభ్యులు వాకౌట్ చేశారు. ఆ తరువాత తాత్కాలిక మేయర్ షేక్ సజీల మెజార్టీ సభ్యుల ఆమోదంతో మేయర్ మనోహర్ రాజీనామాను ఆమోదించారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కూటమి

- అధికారపార్టీకి కమిషనర్ కొమ్ముకాస్తున్నారు
- మున్సిపల్ చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు
- మేయర్ రాజీనామా లేఖను కలెక్టర్‌కు పంపడం ఆమోదయోగ్యం కాదు
- డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు ధ్వజమెత్తారు. కౌన్సిల్ నుంచి వాకౌట్ చేసిన అనంతరం విలేకరులతో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు మాట్లాడారు. కమిషనర్ అధికారపార్టీకి కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని మేయర్లు, డెప్యూటీ మేయర్లను, జెడ్పీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లను టీడీపీ కూటమి భయభ్రాంతులకు గురి చేస్తోందని, పచ్చజెండా పట్టుకుంటేనే పదవిలో కొనసాగుతారని ప్రలోభాలకు గురి చేస్తోందని విమర్శించారు. నగరపాలక సంస్థలో వైఎస్సార్ సీపీ సభ్యులు 46 మంది ఉంటే మెజార్టీ సభ్యులను తమ వైపునకు తిప్పుకుందని ధ్వజమెత్తారు. కమిషనర్ కూడా మున్సిపల్ చట్టాలకు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. మేయర్ తన రాజీనామాను కలెక్టర్‌కు పంపడం ఆమోదం యోగ్యం కాదని పేర్కొన్నారు. దీనిపై లీగల్ ఓపీనియన్ తీసుకుంటామని కౌన్సిల్ సెక్రటరీకి వినతి పత్రం ఇచ్చినట్టు పేర్కొన్నారు.

ఉప ఎన్నికలపై అధికారులతో జెడ్పీ సీఈఓ సమావేశం



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో తొమ్మిది మండల ప్రజా పరిషత్‌లకు సంబంధించిన అధ్యక్ష, ఉపాధ్యక్ష, కో–ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఉప ఎన్నికల నిర్వహణపై జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు మంగళవారం అధికారులతో సమావేశమయ్యారు. జెడ్పీలోని తన చాంబర్లో జరిగిన సమావేశంలో జ్యోతిబసు మాట్లాడుతూ ఈనెల 27న మండల పరిషత్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటుచేసి, అధ్యక్ష, ఉపాధ్యక్ష, కో–ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకునే విధానంపై అధికారులకు సూచనలు చేశారు. ఎన్నికల సన్నాహక ప్రక్రియపై ప్రిసైడింగ్ అధికారులతో పాటు మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు శిక్షణ నిర్వహించారు. పిట్టలవానిపాలెం, భట్టిప్రోలు, దుగ్గిరాల, గుంటూరు రూరల్, తెనాలి, అచ్చంపేట, కారంపూడి, నరసరావుపేట, ముప్పాళ్ల ఎంపీడీవోలతోపాటు ఎన్నికల నిర్వహణకు సంబంధిత జిల్లా కలెక్టర్లచే నియమించిన ప్రిసైడింగ్ అధికారులు హాజరయ్యారు. బాపట్ల మండలం పిట్టలవానిపాలెం మండల అధ్యక్ష ఎన్నికకు బాపట్ల డీఎల్‌డీవో విజయలక్ష్మి, భట్టిప్రోలు కో–ఆప్టెడ్ సభ్యుని ఎన్నికకు బాపట్ల డీహెచ్‌వో వేణుగోపాలరావు, దుగ్గిరాల మండల అధ్యక్ష ఎన్నికకు గుంటూరు డ్వామా పీడీ శంకర్, గుంటూరు రూరల్ ఉపాధ్యక్ష ఎన్నికకు ఏపీఎంఐపీ పీడీ వజ్రశ్రీ, తెనాలి కో–ఆప్టెడ్ సభ్యుని ఎన్నికకు హ్యాండ్లూమ్స్ ఏడీ ఉదయ కుమార్, అచ్చంపేట మండల అధ్యక్ష ఎన్నికకు క్రోసూరు వ్యవసాయశాఖ ఏడీ హనుమంతరావు, కారంపూడి ఉపాధ్యక్ష ఎన్నికకు పల్నాడు డ్వామా పీడీ లింగమూర్తి, నరసరావుపేట ఉపాధ్యక్ష ఎన్నికకు పల్నాడు డీపీఓ ఐ.మురళి, ముప్పాళ్ల కో–ఆప్టెడ్ సభ్యుని ఎన్నికకు పల్నాడు డీహెచ్‌వో కె.కాంతారావు ప్రిసైడింగ్ అధికారులుగా నియమితులయ్యారు. గురజాల డీఎల్‌డీవో గఫ్రూ నాయక్, పెదకాకాని ఈవోపీఆర్డీ కె.శ్రీనివాసరావు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు.

న్యూస్‌రీల్

ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన వాయిదా



గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మార్చి 27 నుంచి 29వ తేదీవరకు మూడు రోజులపాటు నిర్వహించనున్న ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శనను కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేయటం జరిగిందని విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని ఎప్పుడు నిర్వహిస్తారనే విషయాన్ని త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

గణనీయంగా పెరిగిన మల్లేశ్వరుడి ఆదాయం

109 రోజుల హుండీ కానుకల ఆదాయం రూ.58.03లక్షలు



పెదకాకాని: శివాలయం మల్లేశ్వరస్వామి ఆదాయం గణనీయంగా పెరిగినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో మంగళవారం హుండీల్లోని కానుకలు లెక్కించారు. పర్యవేక్షణాధికారిగా కాజ గ్రూపు టెంపుల్స్ ఈఓ పుణ్యాల వెంకటరెడ్డి హాజరయ్యారు. 109 రోజులకు హుండీ కానుకల ద్వారా రూ.58,03,497లు ఆదాయం లభించినట్లు తెలిపారు. అలాగే అన్నప్రసాద వితరణ హుండీ ద్వారా రూ.2,89,270లు సమకూరిందన్నారు. హుండీల ద్వారా బంగారం 54.300 గ్రాములు, వెండి 438 గ్రాములు, ఆస్ట్రేలియా 20 డాలర్లు, యుఎస్‌ఏ 139 డాలర్లు, ఇంగ్లాండ్ 10 పాండ్లు, నేపాల్ కరెన్సీ రూ.130 , ఇండోనేషియా రూ.5000 వచ్చాయని డీసీ తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి విశేష పూజలు



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతి అమరేశ్వరాలయంలో మంగళవారం సుబ్రహ్మణ్యస్వామికి విశేషపూజలు నిర్వహించారు. స్వామివారికి భక్తుల సమక్షంలో అర్చకుడు శంకరమంచి రాజేష్ శర్మ మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరునికి విశేషాలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అమరేశ్వరుని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పలుగ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ముగ్గురు వీఆర్‌ఓలకు షోకాజ్ నోటీసులు

మాచవరం: మాచవరం మండలంలో ముగ్గురు వీఆర్‌ఓలకు ఆర్డీఓ మురళీ కృష్ణ షోకాజ్ నోటీసులను జారీ చేసినట్లు తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. మల్లవోలు, పిల్లుట్ల, తురకపాలెం వీఆర్‌ఓలు ఏసుపాదం, లోకేష్, జానీబాషాలు ఐవీఆర్ కాల్స్‌లో పట్టాదారు పాస్ పుస్తకాల జారీ విషయంలో తమ వద్ద నుంచి డబ్బులు వసూలు చేశారని మూడు గ్రామాలకు చెందిన కొంత మంది రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ముగ్గురు వీఆర్‌ఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు.

హిజ్రా ప్రోద్బలంతోనే హత్య

ప్రియుడే హంతకుడు



జెస్సీ (హిజ్రా), చింటూను అరెస్ట్ చూపిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ తదితరులు

- లక్ష్మీతిరుపతమ్మ హత్య కేసు ఛేదించినట్లు పోలీసుల ప్రకటన
- హిజ్రా భర్తతో తిరుపతమ్మ వివాహేతర సంబంధం
- ప్రియుడినీ దూరం పెట్టిన హతురాలు
- పథకం ప్రకారమే హత్య
- గుట్టుచప్పుడు కాకుండా నిందితుల అరెస్ట్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ కొలనుకొండ డీజీపీ కార్యాలయం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన లక్ష్మీతిరుపతమ్మ హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితులను అరెస్టు చేసి గుట్టుచప్పుడు కాకుండా కోర్టులో మంగళవారం హాజరుపరిచారు. ఈ నేపథ్యంలో మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయన కథనం ప్రకారం.. విజయవాడకు చెందిన హిజ్రా బత్తుల శశి అలియాస్ జెస్సీ ఏడాది క్రితం లక్ష్మీతిరుపతమ్మ(32)ను వ్యభిచార వృత్తిలోకి దించింది. కొలనుకొండ వద్ద ఆమెతో వ్యభిచారం చేయిస్తోంది. ఈ క్రమంలో స్థానికంగా ఉండే ముత్యాల కోమల్ కుమార్ (చింటూ) తిరుపతమ్మకు పరిచయమయ్యాడు. వీరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇద్దరూ ఒకే గదిలో కొంతకాలం సహజీవనం చేశారు. ఈ క్రమంలో జెస్సీ (హిజ్రా) భర్త నవీన్‌తోనూ లక్ష్మీతిరుపతమ్మ వివాహేతర సంబంధం పెట్టుకుంది. ప్రియుడు చింటూను దూరంగా ఉంచుతోంది. దీనిని మనస్సులో పెట్టుకున్న జెస్సీ లక్ష్మీతిరుపతమ్మపై కోపంతో రగిలిపోయింది. చింటూను ఉసిగొల్పి తిరుపతమ్మను హత్య చేయించింది. హత్య జరిగిన 24 గంటల వ్యవధిలోనే నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపర్చినట్లు డీఎస్పీ ప్రకటనలో పేర్కొన్నారు. తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజు, సిబ్బంది కేసును ఛేదించినట్టు వివరించారు. ఇదిలా ఉండగా జనవరి 31న జరిగిన మహిళ హత్యకేసు వివరాలను పోలీసులు వెల్లడించకపోవడం విశేషం.

సీఐ గన్‌కార్యం..!

ఫిరంగిపురంలో ఓవర్ యాక్షన్

- అధికారాన్ని అడ్డం పెట్టుకుని రెచ్చిపోతున్న ఖాకీలు
- అధికార పార్టీకి కొమ్ముకాసి వీఆర్ బాట పడుతున్న వైనం
- సివిల్ పంచాయితీలలో తలదూర్చి శాఖకు చెడ్డపేరు
- రేంజ్ పరిధిలో అడ్డగోలు బదిలీలు, వీఆర్‌లు
- పది నెలల్లో ఒకే స్టేషన్‌కు ముగ్గురు సీఐలు
- కూటమి సర్కారు వచ్చాక ఎల్లో పైరవీలదే రాజ్యం



సాక్షి ప్రతినిధి, గుంటూరు, నగరంపాలెం (గుంటూరు వెస్ట్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ నేతలను పట్టుకుని పోస్టింగ్‌లు తెచ్చుకున్న సీఐలు కొందరు స్వామిభక్తి ప్రదర్శిస్తూ ఓవర్ యాక్షన్ చేస్తున్నారు. మరికొందరు అడ్డంగా దొరికిపోయి వీఆర్ బాట పడుతున్నారు. తాజాగా ఫిరంగిపురంలో సీఐ రవీంద్రబాబు వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఒక స్థల వివాదంలో ఫిర్యాదు చేసిన వారిపైనే దాడికి తెగబడటం, వారికి సినీఫక్కీలో గన్ గురిపెట్టడం, ఒక యువకుడిని గన్‌తో కొట్టి గాయపరిచడం జిల్లాలో సంచలనం రేకెత్తించాయి. ఈ అధికారి సివిల్ పంచాయితీలో తలదూర్చి రెచ్చిపోవడం ఇది రెండోసారి.

గతంలో గోడను పడగొట్టించి మరీ..!

గతంలో పొనుగుపాడు గ్రామంలో దళితుల స్థలంలో గోడను పడగొట్టించి మరీ ఈ సీఐ రోడ్డు వేయించిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకుని వెళ్లిన వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డైమండ్‌బాబుపై కూడా తప్పుడు కేసు నమోదు చేశారు. ఇప్పుడు ఏకంగా గ్రామస్తుల చేతిలో తన్నులు తినే పరిస్థితి తెచ్చుకున్నారు. ఈ అధికారిని ఉన్నతాధికారులు వెనకేసుకొస్తారా, లేక చర్యలు తీసుకుంటారో చూడాలి.

ఈ 'రేంజ్' వేరు..!

సీఐల బదిలీలు, వీఆర్ విషయంలో గుంటూరు రేంజ్ కొత్త ట్రాక్ రికార్డును నెలకొల్పింది. గుంటూరు రేంజ్ డీఐజీగా సర్వశ్రేష్ఠ త్రిపాఠీ వచ్చిన తర్వాత పలువురు సీఐలను బంతాట ఆడుతున్నారు. సరిగ్గా పది నెలలు క్రితం సుమారు 13 మందికిపైగా సీఐలను బదిలీ చేశారు. అయితే వీరు బాధ్యతలు స్వీకరించక ముందే వెనక్కి పిలిచారు. కొందరు సీఐలు బాధ్యతలు చేపట్టిన రోజుల వ్యవధిల్లోనే వెయిటింగ్, వేకెన్సీ రిజర్వ్ (వీఆర్)లోకి వెళ్తున్నారు. కొంతమందికి పోస్టింగ్ ఇవ్వగానే కూటమికి చెందిన పచ్చపత్రికల్లో, సోషల్ మీడియాలో ట్రోలింగ్ మొదలవుతోంది. గత ప్రభుత్వానికి అంటకాగారని, వారికి పోస్టింగ్ ఇవ్వడమేమిటంటూ పోస్టింగ్‌లు వస్తాయి. వెంటనే వారిని వీఆర్‌కు పిలుస్తున్నారు. ఇలా వెళ్లిన వారికి నెలలు గడిచినా పోస్టింగ్‌లు ఉండటం లేదు.

బూట్లతో డెప్యూటీ సీఎం వద్దకు వెళ్లారని వీఆర్‌కు..

జనసేన కార్యాలయంలో డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దీక్షలో ఉండగా బూట్లతో లోపలికి వెళ్లారంటూ మంగళగిరి పట్టణ సీఐ ఎం.శ్రీనివాసరావును వీఆర్‌కు పంపడం కూటమి ప్రభుత్వ విధానాలకు పరాకాష్ట. కొన్ని స్టేషన్లకు సీఐగా వస్తే ఎన్ని రోజులు ఉంటారో తెలియని పరిస్థితి. పట్టాభిపురంలో ఇప్పటికి నలుగురు సీఐలు మారారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆ స్టేషన్‌కు సీఐగా కిరణ్ వచ్చారు. అతను ఎమ్మెల్యే భర్త ఆదేశాల మేరకు వేరే వారిపై ఎస్సీ,ఎస్టీ కేసు పెట్టడంతో అతనిని వీఆర్‌కు పంపారు. తర్వాత వీరేంద్రబాబు వచ్చీరాగానే సివిల్ పంచాయితీలలో వేలుపెట్టారు. విపక్ష నాయకులే టార్గెట్‌గా కేసులు పెట్టి వేధింపులకు దిగారు. అయితే అతన్ని కూడా వీఆర్‌కు పంపించి మధుసూదన్‌కు డీవో ఇచ్చారు. విధుల్లో చేరిన 24 గంటల్లోనే పోస్టింగ్ నిలిపేసి గాల్లో పెట్టారు. అరండల్‌పేట స్టేషన్‌కూ మొదట కుంకా శ్రీనివాసరావును తీసుకురాగా బోరుగడ్డ అనీల్ కేసులో వీఆర్‌కు పంపించి వీరాస్వామిని తీసుకువచ్చారు. నగరంపాలెం స్టేషన్‌కు మొదట మధుసూధనరావును, తర్వాత నాయక్, ప్రస్తుతం నజీర్‌బేగ్‌ను తీసుకొచ్చారు.

- తాజాగా రెండు రోజుల క్రితమే అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్‌పై వేటు పడింది. గ్రంధశిరి గ్రామంలో జరిగిన వివాదంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు ఒక నిందితుడు తప్పించుకుపోయేలా వ్యవహరించిన అంశంలో వీఆర్‌కు పిలిచారు.

25 మంది వీఆర్‌లో..

ప్రస్తుతం రేంజ్‌లో సుమారు 25 మందికి పైగా సీఐలు వీఆర్‌లో ఉన్నారు. వీరంతా కూడా కూటమి అధికారంలోకి వచ్చాక వీఆర్‌కు వెళ్లిన వారే. సీఐల పోస్టింగులలో అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన సామాజిక వర్గానికి పెద్దపీట వేశారు. మిగిలిన వారిని వీఆర్‌కు పిలవడం లేకపోతే ప్రాధాన్యం లేని పోస్టింగ్‌లు కట్టబెట్టడం చేస్తున్నారు. లూప్‌లైన్ పోస్టింగ్‌లు ఇచ్చినా చిన్న చిన్న కారణాలతోనే వారిని పక్కన పెట్టారు.





మిర్చి రైతు ఆగ్రహ తేజం

మిర్చి రైతు ఆగ్రహ తేజమై రగిలారు. తేజ రకం మిర్చి ధర దారుణంగా పడిపోవడంతో కర్షకుల కడుపు మండింది. మంగళవారం ఉదయం రోడ్డెక్కారు. మిర్చి యార్డు మెయిన్ గేటు ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. కూటమి సర్కారు తీరుపై నిరసన వ్యక్తం చేశారు. దీంతో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. జేసీ భార్గవతేజ ఘటనాస్థలానికి చేరుకుని రైతులకు సర్దిచెప్పేయత్నం చేశారు. అయినా కర్షకులు వినలేదు. తమ గోడు వినిపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

– కొరిటిపాడు(గుంటూరు వెస్ట్)

నకిలీ అధికారులకు జైలు

అద్దంకి: లారీ డ్రైవర్‌ను ఆర్టీవోనంటూ బెదిరించి రూ.25వేలు కాజేసిన కేసులో నిందితులు ఇద్దరికి ఏడాది జైలు శిక్షను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కే సీత విధించినట్లు సీఐ సుబ్బరాజు మంగళవారం తెలిపారు. 2015 జనవరి నెల 18వ తేదీన చక్రాయపాలెం వద్ద నామ్ రహదారిలో జరిగిన ఘటన వివరాలు.. నెల్లూరు జిల్లా గూడూరు పట్టణానికి చెందిన గోవిందస్వామి సురేష్ మార్బుల్ లోడుతో మధ్యప్రదేశ్ నుంచి చెన్నై బయలుదేరాడు. మార్గంమధ్యలో అద్దంకిలోని చక్రాయపాలెం వద్దకు రాగానే తన లారీని నిందితులైన అజిత్‌కుమార్ సింగ్, అజయ్‌సింగ్‌లు మేము ఆర్టీఓలమని చెప్పి క్లీనర్‌ని కొట్టి అతని వద్దనున్న రూ.25 వేలు తీసుకొని వెళ్లారు. ఈ విషయమై అప్పట్లో అద్దంకి ఎస్ఐగా పనిచేసిన సీహెచ్ వెంకటేశ్వర్లుకి బాధితుడు గోవిందస్వామి ఫిర్యాదు చేశారు. కేసు విచారణలో భాగంగా నిందితులైన అజిత్‌కుమార్ సింగ్, అజయ్ సింగ్‌లపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి సంవత్సరంపాటు జైలు శిక్ష, రూ.పది వేల జరిమానా జడ్జి విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **6,500** గరిష్ఠం : రూ. **8,100**

మోడల్ ధర రూ. **7,400**

క్లుప్తంగా

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డుకు మంగళవారం 487 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 373 బస్తాలు రాగా, వాటి కనిష్ఠ ధర రూ.10,500, గరిష్ఠ ధర రూ.11,100, మోడల్ ధర రూ.11,001 పలికింది. కాయలు 114 బస్తాలు రాగా వాటి కనిష్ఠ ధర రూ.10,500, గరిష్ఠ ధర రూ.11,100, మోడల్ ధర రూ.11,001 పలికింది.

ఉగాది సంబరాలకు మాచిరాజుకు ఆహ్వానం



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): వచ్చేనెల 12న తెలుగు కళా సమితి (తెలుగు ఫైన్ ఆర్ట్స్ సొసైటీ, అమెరికా న్యూజెర్సీ) ద్వారా అమెరికాలో జరిగే ఉగాది సంబరాలకు శ్రీనగర్‌లో ఉంటున్న రుద్ర కళాక్షేత్రం సంస్థ ప్రచార్యులు, నాట్య విశారద మాచిరాజు రాజేష్‌కుమార్‌కు ఆహ్వానం పంపించారు. న్యూజెర్సీలో దశాబ్దాలుగా కళ లు, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో తెలుగు వారి కోసం కృషి చేస్తున్న తెలుగు కళా సమితి ద్వారా ఆహ్వానాన్ని పంపించడం అదృష్టంగా ఉందని నాట్యాచార్యులు రాజేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైద్య కళాశాలకు రూ.25 లక్షల విరాళం



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో క్యాంటీన్ నిర్మాణం కోసం గుంటూరుకు చెందిన సీనియర్ స్పైన్ సర్జన్, మల్లి స్పైన్ సెంటర్ అధినేత జె.నరేష్‌బాబు కుటుంబం రూ.25 లక్షలు విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి కళాశాలలో క్యాంటీన్ నిర్మాణం కోసం విరాళం ఇవ్వాలని మంగళవారం డాక్టర్ జె.నరేష్‌బాబును కోరగా, ఆయన తన కుటుంబ సభ్యుల పేరు మీద రూ.25 లక్షలు విరాళం ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు. దీంతో సుందరాచారి నరేష్‌బాబు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఐపై చర్యలు తీసుకోవాలి

- శాంతిపేట వాసుల రాస్తారోకో
- స్థలం వివాదం పరిష్కరించాలని డిమాండ్

ఫిరంగిపురం: స్థానిక శాంతిపేటలో ఓ స్థలం వివాదం నేపథ్యంలో దళితులపై దురుసుగా ప్రవర్తించిన సీఐ రవీంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రాత్రి కాలనీ వాసులు రాస్తారోకో చేశారు. ఫలితంగా గుంటూరు -కర్నూలు రాష్ట్రరహదారిపై ఇరువైపుల రెండకిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఘటనా స్థలానికి చేరుకున్న గుంటూరు డీఎస్పీ భానోదయ కాలనీ వాసులకు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌కు మంగళవారం ఉదయం శాంతిపేట కాలనీ వాసులను డీఎస్పీ మురళీకృష్ణ పిలిపించి వారితో మాట్లాడారు. సీఐపై ఫిర్యాదు చేస్తే తగిన న్యాయం చేస్తానని చెప్పడంతో వారు జరిగిన విషయాలు తెలియజేస్తూ ఫిర్యాదు అదించారు. దీనిపై గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్ దృష్టికి తీసుకువెలతానని సీఐపై కేసు కడతానని డీఎస్పీ మురళీకృష్ణ హామీ ఇచ్చారు.



డీఎస్పీ మురళీకృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు.

తహసీల్దార్‌కు వినతి

శాంతిపేటలో స్థలాన్ని కాలనీకి చెందిన జి.చిన్న అనే వ్యక్తి ఆక్రమించుకుని నిర్మాణం చేపడుతున్నాడని ఆ భూమి 608 ఏ-1 గ్రామకంఠానికి చెందిన భూమి అని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ జె.ప్రసాదరావుకు, స్థానిక పంచాయతీ ఈవో ఏకేబాబుకు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ ఆ భూమి పంచాయతీ పరిధిలోకి వస్తుందని తెలిపారు. అనంతరం కాలనీవాసులు గుంటూరులోని స్థానిక ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేస్తామని చెప్పారు.

న్యాయం కావాలి



శాంతిపేటలోని స్థలం దేవర స్థలం. ఎన్నో ఏళ్లగా అది ఖాళీగా ఉంది. దానిని స్థానిక వ్యక్తి ఆక్రమించడంపై ప్రశ్నిస్తే వారిపై విచక్షణ రహితంగా సీఐ విరుచుకుపడ్డారు. మాకు న్యాయం కావాలి.

– నేలటూరి సుకన్య, శాంతిపేట వాసి

స్థలం అప్పగించాలి



దేవర స్థలం ఆక్రమించిన వ్యక్తిని పట్టించుకోకుండా ప్రశ్నించిన వారిపై సీఐ రవీంద్ర బాబు దురుసుగా ప్రవర్తించారు. మహిళలు అనికూడా చూడలేదు. ఏంజరిగిందో తెలుసుకోకుండానే దాడిచేసి కొట్టారు. స్థలం అప్పగించాలి.

– ఎస్.నాగమ్మ, శాంతిపేట వాసి

దాడి చేయడం అన్యాయం



న్యాయం కోసం నిలిచిన వారిపై ఇష్టారాజ్యంగా దాడి చేయడం దారుణం. ప్రశ్నిస్తే చాలు తుపాకీతో యువకుడిని పొడవడంతో రాస్తారోకో చేయాల్సి వచ్చింది. న్యాయ పోరాటం చేస్తాం.

– నూతలపాటి జ్యోతి, శాంతిపేట వాసి

కాలనీవాసుల సమస్య



కాలనీవాసుల సమస్య ఇది. పార్టీలకు ప్రమేయం లేదు. కొందరు అలా చిత్రీకరించేందుకు యత్నిస్తున్నారు. దీనిని ఖండిస్తున్నాం. కాలనీ వాసులకు న్యాయం చేయాలి.

– దాసరి సురేష్, శాంతిపేటవాసి

పేదలందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలి

సీపీఎం కార్యదర్శి పాశం రామారావు

మంగళగిరి: మంగళగిరి నియోజకవర్గంలోని ఇళ్లు లేని అందరికీ ఇళ్ళస్థల పట్టాలు అందజేయడంతో పాటు ఎన్నో ఏళ్లగా కొండ పోరంబోకు, అటవీ, ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని ఉంటున్న పేదలకు అదే స్థలాల్లో పట్టాలివ్వాలని, లేకుంటే ప్రజలను సమీకరించి ఉద్యమం తీవ్రతరం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు హెచ్చరించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో వచ్చిన ప్రజా సమస్యలను పరిష్కరించాలంటూ మంగళవారం మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో 23వేల మంది పేదలు ఇంటి స్థలాల కోసం ఎదురు చూస్తుంటే మంత్రి నారా లోకేష్ ఐదు వేల మందికి పట్టాలిస్తామనడం సరికాదన్నారు. 23 వేల మంది స్థలాల పట్టాలివ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించాలన్నారు. మంగళగిరి పట్టణంలోని 134 సర్వేలోని ప్రభుత్వ భూమిని పేదలకు ఇవ్వాలని కోరారు .నగరంలోని అనేక కాలనీలలో డ్రెయినేజీ, తాగునీటి సమస్య ఉందని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పేరుతో చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేలు ఇచ్చిందని, అలాగే టీడీపీ ప్రభుత్వం కార్మికులకు పథకం వర్తింపజేసి ఏడాదికి రూ రూ.24 వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వీసం జవహర్‌లాల్, జేవి రాఘవులు, పిల్లలమర్రి బాలకృష్ణ, ఎస్ఎస్ చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నాలో మాట్లాడుతున్న పాశం రామారావు

దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ(గుంటూరు) : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ పరీక్ష ఫలితాలను వర్సిటీ వీసీ ఆచార్య కంచర్ల గంగాధర్ రావు మంగళవారం విడుదల చేశారు. మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు ఈనెల 31న తుది గడువుగా నిర్ణయించారు. అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, ర్యాంక్ పొందిన వారితోపాటు ఏపీ ఐసెట్ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులు నేరుగా ఈ కోర్సుల్లో అడ్మిషన్లను పొందవచ్చు అని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య దిట్టకవి రామచంద్రన్ లు తెలిపారు. ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఫలితాలు, ర్యాంక్ కార్డులను వర్సిటీ వెబ్సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌యూసీడీఈ.ఇన్ఫో నుంచి పొందవచ్చన్నారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో వర్సిటీ ఓఎస్డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ రవికుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి, సూపరింటెండెంట్‌లు జవ్వాజి శ్రీనివాసరావు, నేలపాటి నాగేశ్వరరావు, వర్సిటీ సిబ్బంది రాధాకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న వర్సిటీ అధికారులు

రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా సుబ్బారెడ్డి

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ స్విమ్మింగ్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా పట్టణానికి చెందిన వై.వి.సుబ్బారెడ్డి ఎన్నికయ్యారు. విజయవాడలో ఈనెల 23వ తేదీన అసోసియేషన్ సమావేశంలో నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నికల్లో సుబ్బారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ 4 సంవత్సరాల పాటు సేవలు అందించనుంది. పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా సేవలు అందిస్తున్న సుబ్బారెడ్డి రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎన్నిక కావటంపై జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఏఏవీ రామలింగారెడ్డి, కోశాధికారి వై.వి.శ్రీనివాసరెడ్డి అభినందనలు తెలిపారు.

స్తంభోద్భవ అలంకారంలో నారసింహుడు

మంగళగిరి: మంగళాద్రి వేంచేసివున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారి అలంకారోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు స్తంభోద్భవం అలంకారంలో దర్శనమివ్వగా భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ కైంకర్యపరులు రావూరి కృష్ణమూర్తి, సుబ్బారావు ,శ్రీనివాస రావు,వైజాగ్‌కు చెందిన అంగలూరి శరకోపాచార్యులు వ్యవహరించారు. బుధవారం అలంకారోత్సవాలలో భాగంగా కాళీయమర్ధనం అలంకారంలో స్వామి వారు దర్శనమివవ్వనున్నారు. ఉత్సవాన్ని ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.



అమరావతిలో మంత్రి నారాయణ పరిశీలన



కార్యాలయాలను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

తాడికొండ: రాజధాని అమరావతి ప్రాంతంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ మంగళవారం పర్యటించారు. రాయపూడి సమీపంలో నిర్మాణంలో ఉన్న కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయాలను పరిశీలించిన ఆయన అధికారులను అడిగి పలు వివరాలు తెలుసుకొని సూచనలు చేశారు. ఈ అనంతరం మీడియాతో మాట్లాడుతూ రూ.43 వేల కోట్లతో గత ప్రభుత్వంలో టెండర్లు పిలిచామని, అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆలిండియా సర్వీస్ అధికారుల భవనాలు దాదాపు పూర్తయ్యాయన్నారు. మొదట రాజధానిలో క్లీనింగ్ పనులు పూర్తయ్యాయని ఇప్పుడు సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీ బంగ్లాలు పరిశీలించినట్లు పేర్కొన్నారు. 186 బంగ్లాలు, మంత్రులు, జడ్జిలు, కార్యదర్శులు ప్రధాన కార్యదర్శులకు వస్తున్నాయన్నారు. గెజిటెడ్ అధికారులకు 1440, ఎన్‌జీవోలకు 1995 నిర్మాణాలు వస్తున్నాయని, హైకోర్టు 16.85 లక్షల చదరపు అడుగులు వస్తుందని, అసెంబ్లీ 250 మీటర్ల ఎత్తులో అందుబాటులోకి రానుందన్నారు. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నుంచి రుణాలు తీసుకున్నామని, ల్యాండ్ వాల్యూ పెరిగిన తరువాత అప్పు తీరుస్తామని వెల్లడించారు.

సహకార సంవత్సర ప్రణాళిక కోసం కమిటీలు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఎ.భార్గవ్‌తేజ

గుంటూరు వెస్ట్: ఐక్యరాజ్య సమితి 2025-26 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా(ఐవైసీ) ప్రకటించిందని, దీని ప్రణాళిక కోసం జిల్లా కమిటీలు ఏర్పాటు చేశామని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జిల్లా కో-ఆపరేటీవ్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ ఐవైసీ సంవత్సర లక్ష్యాలు, జిల్లాస్థాయి ప్రణాళికలు, వార్షిక కార్యాచరణ రూపొందించాలన్నారు. దీనికి సంబంధించి కమిటీ క్యాలెండర్ ఆమోదించిందని తెలిపారు. జిల్లాలో ప్రైమరీ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీల వివరాలతోపాటు, కొత్తగా కమిటి సభ్యుల వివరాలు కంప్యూటరైజేషన్ ప్రక్రియను నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం వెంటనే పూర్తి చేయాలన్నారు. ఏప్రిల్ నెలలో ఐవైసీ యాక్షన్ ప్లాన్ చేయాల్సిన యాక్టివిటీస్‌కు సంబంధించి ఏప్రిల్ 7న వరల్డ్ హెల్త్ డే సందర్భంగా మహిళలకు హెల్త్ క్యాంపులు నిర్వహించాలన్నారు. మల్టీపర్పస్ స్పెషలిటి సెంటర్ గోడౌన్‌లకు ప్రపంచంలోనే అతిపెద్ద ధాన్యం నిల్వ ప్రణాళిక ప్రాజెక్టు కింద ఏదైనా కవర్ చేయడానికి అవకాశం ఉందో లేదో చూడాలన్నారు. జిల్లాలో పీఏసీలు నాబార్డు ద్వారా అందించిన ఆర్థిక సహాయంతో నిర్మించిన మల్టీపర్పస్ గోడౌన్‌లలో స్థానిక రైతులు వారి పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీల ద్వారా అందించిన రుణాలు, ఓవర్‌జ్యూస్ యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని రికవరీ చేయాలన్నారు. ఏపీ పాడిపరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ వివిధ మండలాల్లో మహిళ పాడి సహకార సంఘ 15 గ్రామాలను గుర్తించామన్నారు. జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలో 101 ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సంఘాలు పనిచేస్తున్నాయని జేసీ వివరించారు. సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి విరాచారీ, డీపీఓ నాగసాయికుమార్, వ్యవసాయ శాఖ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, జీడీసీసీ బ్యాంకు సీఈఓ కృష్ణవేణి, అధికారులు పాల్గొన్నారు.

మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): మిర్చికి క్వింటాకు రూ.25వేలు చొప్పున గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కొత్తపేటలోని జిల్లా సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.11,781లు మద్దతు ధర అని ప్రకటించి మిర్చి రైతులకు తీరని అన్యాయం చేశాయన్నారు. ప్రభుత్వానికి రైతుల ఆత్మహత్యలు కనిపించడం లేదని ఆవేదన చెందారు. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ప్రతి రైతుకు అన్నదాతా సుఖీభవ ద్వారా రూ.20 వేలు ఇస్తానని ప్రకటించి ఇప్పటికీ ఇవ్వలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి గిట్టుబాటు ధర ఇవ్వకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

వేసవిలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

పలు సూచనలు చేసిన సహాయ కార్మిక శాఖ అధికారి

నరసరావుపేట: వేసవిలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి ఆఫీసర్, సహాయ కార్మికశాఖ అధికారి జి.ధనలక్ష్మి కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విపత్తుల నివారణ సంస్థ హెచ్చరికలకు అనుగుణంగా కార్మికుల రక్షణకు యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని కోరారు. కర్మాగారాలు, దుకాణాలు, భవన నిర్మాణ కార్మికులు, ఉపాధిహామీ కూలీలు, వలస కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటికే పలు సూచనలు చేశామన్నారు. పనిచేసే సమయం మార్చి పనిప్రాంతంలో చల్లని నీడ, నీటివసతి కల్పించాలని తెలిపారు. వైద్యసిబ్బందితో సమన్వయం చేసుకొని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, అత్యవసర మందులు సమకూర్చుకోవాలని చెప్పారు.

విశ్రాంత పోస్టల్ ఉద్యోగుల సమస్యలపై పోరాటాలే శరణ్యం

రాష్ట్ర కమిటీ 2వ సర్వసభ్య సమావేశంలో ఎన్‌సీసీపీఏ సెక్రటరీ జనరల్ కె.రాఘవేంద్రన్

తెనాలి: స్థానిక కొత్తపేటలోని కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీలోని డీఎల్ కాంతారావు కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం ఆలిండియా పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ 2వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ఎం.ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్‌సీసీపీఏ సెక్రటరీ జనరల్ కె.రాఘవేంద్రన్ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సంఘాన్ని పటిష్ఠం చేసి, ఐక్యంగా పోరాడాలని సూచించారు. వైద్యసదుపాయాల అంశంలో ఉన్న సమస్యలపై పోరాడాల్సి ఉందన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్ ఆవశ్యకతను సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా కోర్టు తీర్పు కాపీలను రాష్ట్ర నలుమూలల్నుంచి వచ్చిన కార్యకవర్గసభ్యులు రాష్ట్ర కార్యదర్శి నిమ్మగడ్డ నాగేశ్వరరావుకు అందజేశారు. విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని గౌరవాధ్యక్షుడు డీఎల్ కాంతారావు హామీనిచ్చారు. ఎఫ్ఎన్‌పీఓ సెక్రటరీ జనరల్ శివాజీ మాట్లాడుతూ సర్వీసు ఉద్యోగుల సమస్యలు, ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ వ్యతిరేక విధానాలను వివరించారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని చెప్పారు. ఏఐపీఈయూ పోస్ట్‌మెన్, గ్రూప్-డి సర్కిల్ కార్యదర్శి సీహెచ్ విద్యాసాగర్ మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, వ్యతిరేక విధానాలను తీవ్రంగా దుయ్యబట్టారు. పెన్షనర్లు, ఉద్యోగులు ఐక్యపోరాటాలను జరపాల్సిన ఆవశ్యకతను వివరించారు. సభలో ఆయా సంఘాల నేతలు ఎస్.రామారావు, కేఎస్‌సీ బోసు, న్యాయవాది బి.జయభారతరెడ్డి, అతిథులు డి.మోహనరావు, కె.రాజారావు, పి.బాబూజీ, సీహెచ్ కోటేశ్వరరావు, వివిధ డివిజన్ల కార్యదర్శులు ప్రసంగించారు. తొలుత ఏఐపీఆర్‌పీఏ జెండాను డీఎల్ కాంతారావు, ఎన్‌సీసీపీఏ జెండాలను కె.రాఘవేంద్రన్ ఆవిష్కరించారు.



మాట్లాడుతున్న కె.రాఘవేంద్రన్

గుంటూరు రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వృద్ధురాలు (55) మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం .. నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ గుంటూరు ప్లాట్‌ఫాం -1 వద్దకు చేరుకునే సరికి రైలులో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెంది ఉంది. సమాచారం తెలుసుకున్న జీఆర్పీ పోలీసులు ఘటన స్థలం వద్దకు చేరుకుని మృతురాలి వివరాలను సేకరించగా ఎలాంటి వివరాలు లేక పోవడంతో పోలీసులు గుర్తు తెలియని మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు జీఆర్పీ సీఐ అంజిబాబు 9440627546, ఎస్ఐ దీపికా 9121715242, జీఆర్పి పోలీస్ స్టేషన్ 0863-2220753 నంబర్లకు సమాచారం తెలియజేయాల్సిందిగా తెలిపారు.

రైలు ఢీకొని కానిస్టేబుల్ మృతి



పెద్దనబోయన రాఘవరెడ్డి(ఫైల్)

తెనాలిరూరల్: రైలు ఢీకొని ఏపీఎస్పీ బెటాలియన్ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన తాడేపల్లి మండలం ఇప్పటం వద్ద చోటుచేసుకుంది. తెనాలి జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. మంగళగిరి ఆరో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న పెద్దనబోయన రాఘవరెడ్డి(46) తనతో కలసి డ్యూటీలో ఉన్న సహచరులకు వారి ఇళ్ల నుంచి మంగళవారం భోజన క్యారేజీలను తీసుకెళ్లాల్సి ఉంది. 11 గంటల ప్రాంతంలో సహచరులకు ఫోన్ చేసి భోజనాలు సిద్ధమయ్యాయో లేదో కనుక్కుంటే తీసుకొస్తానని చెప్పాడు. కొద్ది సేపటికే ఇప్పటం రైల్వే గేటు వద్ద పట్టాల వెంబడి మృతి చెంది పడి ఉన్నాడు. పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. రైలు ఢీకొట్టిందా లేక సడెన్‌గా రైలు రావడంతో పక్కకు జరిగే క్రమంలో కాలు జారి పడడంతో తల వెనుక భాగంలో గాయమై మృతి చెందాడా అన్న అంశాలు దర్యాప్తులో తెలుస్తాయని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.